# నైధనతార

"**మా** అమ్మగారు మీకు తాంబూలం యిస్తారుట. ఈ పూట యింటికి తప్పక రమ్మన్నారు. రేపు ఆవిడ వూరికి వెడతారుట" అని శారదాంబగారి నౌకరు నారాయణ సిద్ధాంతిగారితో అన్నాడు.

నారాయణ సిద్ధాంతిగారు ఆ పరగణాలో ముహూర్తం - ప్రశ్న - జ్యోతిషం- వాస్తు శాస్త్రాలలో మేటి మొనగాడు, ఆ శాస్త్రాలలో ఆయనకు తెలియని విషయం **లేదు** అంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే, ఆయన సద్గురువుల వద్ద **వేదవేదాం**గాలు సక్రమంగా చదువుకున్నాడు. వారి ఆశీస్సులు పొందడమే కాదు **పీఠాధిప**తుల వద్ద మంత్ర దీక్ష పొందారు. వాక్శుద్ధిగల వాడుగా పేరుపొందారు.

ఎందరి తలరాతలనో సరిదిద్దాడు.

ఇన్ని పనులు **చేసినా, పెద్దమ్మ**వారి ముద్దు బిడ్డగా - సరస్వతీ వరప్రసాదుడు గానే మిగిలిపోయాడు.

ఇల్లాలి సలహా మేరకు నిత్యం కనకధారాస్తవం, విష్ణు సహస్రనామం పారాయణ చేసినా, సంసార తాపత్రయంలో రవ్వంత విరామం దొరికితే స్మరణ చేసేది - తనకు నచ్చినది - బమ్మెర పోతనగారి 'భాగవతం'లో మొదటి పద్యం.

"శ్రీ కైవల్య పదంబు చేరుటకు నైచింతించెదన్."

ముఖంలో వర్చసు పెరిగింది. కీర్తి నలుదిక్కులా వ్యాపించింది. కాని- అడుగు నేల మీదనే వుంది - అందలం ఎక్కలేదు.

"ఇందరికి యింతకాలంగా ఎంతో మేలు చేస్తున్నారు. ఎన్నో మంచి విషయాలు చెబుతున్నారు. మీరు మాత్రం - ఏ మాత్రము ఎదుగు బొదుగు లేకుండా యీ తీరునె వున్నారేం?" అని తనతో పనిలేనివారు ప్రశ్నిస్తూ వుంటే ఆయన సమాధానం మధురమైన మందహాసం!!

తనలో తాను అనుకున్న మాట -

"పూర్వజన్మ సుకృతం!!"

"ఇందరి జాతకాలు చూశారు కదా - మీ జాతకం ఎప్పుడైనా చూసుకున్నారా!' అని హిత చింతకులు అడిగితే ఆయన సమాధానం -

"పెద్ద పెద్ద దైవజ్ఞులే చూశారు!"

"ఏమన్నారు?"

"చాలా గొప్ప యోగ జాతకం అన్నారు. బుధ ఆదిత్య యోగం అన్నారు. గజకేసరి యోగం వంటి మంచి యోగాలు వున్నాయి కాని - వీటి అన్నింటిని, ఖేమద్రుమ యోగం మ్రింగేసిందని అన్నారు."

"దానివల్ల ఏమి జరుగుతుంది? నష్టమా?"

"పెద్ద నష్టమేమీ లేదు - మనం అందరికి ఉపయోగపడతాం - కాని ఇతరుల వలన మనకు ఉపయోగం వుండదు."

"దీన్ని మార్చడానికి ఏదైనా అవకాశం కాని, శాంతి ప్రక్రియ కాని వుందా?'

"ఉన్నదల్లా ఒక్కటే ఉపాయం - ఈ జన్మలో పుణ్యం సంపాదించడం, వచ్చే జన్మలో ఆ పుణ్య ఫలాన్ని అనుభవించడం."

"అప్పటిదాకా?"

"ఆ వైకుంఠవాసుడిని నమ్ముకుని- ఏరోజు కారోజు శుచిగా బ్రతకడం!"

"అంతేనా!?"

"అంతే!!"

దీని తరువాత ఆయన యోగక్షేమాల సంగతి ఎవ్వరికి పట్టలేదు! ఆ శ్రీహరికి తప్ప!!

రెండు పుష్కరాలుగా ఆ దంపతులుకు రెండు జతల బట్టలు, ఒక పూట భోజనం, నెలకు పదిహేను ఏకాదశులు!!

మనస్సులో అనుక్షణం మసలేది - రెండు రెండక్షరాల మాటలు- సిరి, హరి.

దారిద్ర్యం వున్నా దీనత్వం లేని యీ నిష్ణాతులకు భగవంతుడు అడగకుండానే యిచ్చిన వరాలు ఆరోగ్యం! ఆనందం!!

అందరు యిల్లాళ్ళలాగానే ఆయన అర్ధాంగి సామిదేవమ్మగారు కాపురానికి వచ్చిన మొదటి పుష్కరంలో సంతానం కోసం ఎదురు చూసింది. కలగకపోయేసరికి పున్నామనరకం గురించి భయపడ్డది!!

'పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు' అన్న వాక్యం గుర్తుకు వచ్చి దాన ధర్మాలు చెయ్యాలని సంకల్పించింది. ఉబలాట పడ్డది. ధర్మంగా ఉండటం సాధ్యమైయింది! దానమే శక్తికి మించిన పని అయింది. అంతులేని దిగులు వేసింది. కాని ఆయన మాటలు విన్న తరువాత మనస్సుకు ఉపశమనం కలిగింది!!

దానం అంటె - ధనదానం - వస్త్రదానం ఒక్కటే కాదు - ఆపదలో ఉన్న వారికి - దుఃఖంలో ఉన్నవారికి - మంచి మాటలతో - మంచి చేతలతో మనం చేసే సహాయం కూడా - దానమే!

ఆనాటినుంచి - ఆవిడ - ఆ వాడలోని వారికి పెద్ద దిక్కు అయ్యింది. తలలోని నాలుక అయ్యింది.

ఆ ప్రాంతానికి వారే ఆది దంపతులు, పార్వతీ పరమేశ్వరులు!!

పార్వతీ పరమేశ్వరులు అయ్యారు. కాని కుబేరుడి స్నేహితులు కాలేక పోయారు!!

ఆనాటికి యీనాటికి ఆ లోగిలిలో ఉయ్యాల తొట్టె కట్టలేదు. పసిపిల్ల ఏడుపు వినిపించలేదు!!

అమిత ఆవేదనతో ఆయనను ఒకనాడు ప్రార్థించింది - "నేను గొడ్రాలిని- మన వంశం నిలబడటం కోసమన్నా మీరు మళ్ళీ వివాహం చేసుకోండి."

"శివా శివా" అంటూ సిద్ధాంతిగారు చెవులు మూసుకున్నారు. "సామిదేవీ, హాస్యానికైనా ఎప్పుడు ఇటువంటి మాటలు అనవద్దు" అంటూ మందలింపుగా అంటూంటే ఆయన మనస్సు - మాట గద్గదమైయ్యాయి.

"వంశం..." అంటూ ఆవిడ ఏదో చెప్పబోయింది.

"ఏ వంశం ఎంతకాలం యీ భూమి మీద ఉండాలో, అవి ఎవరి ద్వారా నిలబడాలో నిర్ణయించేది ఆ సర్వేశ్వరుడే!! మానవుల లాగానే వంశాలు పుడుతూ వుంటాయి. గిట్టుతూ వుంటాయి. అది సహజం. కాలం తీరిన వంశం కాలగర్భంలో కలసిపోతుంది. దాని ఆయుర్దాయము పొడిగించడానికి మనం ప్రయత్నం చెయ్యడం అవివేకం."

ఆ విషయం గురించిన ప్రస్తావన ఆ యింట్లో మళ్ళీ రాలేదు.

"శారదాంబగారి యింటికి వెళ్ళివస్తాను" అంటూ సిద్ధాంతిగారు లేచారు.

ఇల్లాలు ఒక్క క్షణం తటపటాయించింది.

"ఈనాడు మంగళవారం! నక్షత్రం మీకు నైధనతార!! రేపటి రోజున వెడితే బాగుంటుందేమో!" అని అన్నది.

"రేపు ఆవిడ వూరికి వెడతారుట! ఈరోజే రమ్మని కబురు చేశారు! వెళ్ళి వస్తే సరిపోతుంది."

"ఆహ్వానం - ఉభయులకునా? మీ ఒక్కరికేనా?"

"ఆ వార్తలో ఆ వివరాలు లేవు... పిలుపు నా వరకు మాత్రమే ననిపించింది.'

ఆవిడ చిరునవ్వు నవ్వి శుభశకునంగా ఎదురు వచ్చింది.

"క్షేమంగా వెళ్ళి లాభంగా రండి" అని అంది.

ఆయన కూడా - స్మిత వదనంతో - "లాభం కంటే క్షేమం ముఖ్యం' అని ఆయన శారదాంబగారి యింటి వైపు నడిచాడు.

సుమారు పద్దెనిమిది మాసాల క్రితం తనని వెతుక్కుంటూ ఆవిడ వచ్చింది. ముఖంలో దైన్యం, భయం, ఆందోళన కనిపిస్తున్నాయి. అంజలి ఘటియించి తన ముందు నిలబడ్డది.

రిక్తహస్తంగా వచ్చింది - చేతిలో ఫలం, పుష్పం లేవు - ఆవిడ తన **జాతకం** కాగితాలు ఆయన చేతిలో పెడుతూ "చాలా కష్టాలలో, యిబ్బందులలో వున్నాను. ప్రాణ భయం వేస్తోంది. మీరు రక్షిస్తారని యీ ఆపద గట్టెక్కిస్తారని మీ శరణుకోరి వచ్చాను" అంటూ సాష్టాంగ నమస్కారం చేసింది.

ఆయన ఆవిడని దీవిస్తూ - "అందరికి శరణు యివ్వగలిగిన వాడు కరుణానిధి. శరణాగత వత్సలుడు - ఆ శ్రీమన్నారాయణుడే. వారిని ఆశ్రయించండి. అన్ని ఆపదలు తొలుగుతాయి. లక్ష్మి కటాక్షం కలుగుతుంది.'

ఆవిడ మళ్ళీ నమస్కరిస్తూ, "నాకు తెలిసిన లక్ష్మీనారాయణులు మీరే. మీరు ఏది చెయ్యమంటే అది చేస్తాను!"

రవ్వంతసేపు అంతర్ముఖులైనారు.

ఆవిడ మనస్సులోని మాటలు ఆయనకు వినిపించాయి.

'నీవే తప్ప, ఇతఃపరం బెరుగ మన్నింపన్
దగన్ దీమనిన్
కావవే ఈశ్వర - కావవే వరద సంరక్షించు
భద్రాత్మకా!!'

ఆయన చిరునవ్వుగా ఆవిడ వంక చూశారు. "మబ్బులు తొలగిపోతాయి! మళ్ళీ వెలుగు వస్తుంది. జీవితమంతా ఎప్పుడూ అమావాస్యగా ఉండదు. మీరు చేయవలసిన పనులు యీ కాగితం మీద రాశాను. ఆ ప్రకారం చేయండి. సుఖం కలుగుతుంది."

"ఏమి చెయ్యాలో చెప్పండి. తప్పక చేస్తాను."

"ఈ వారంలో మంగళవారంనాడు, నూట ఎనిమిదిసార్లు హనుమాన్ చాలీసా పారాయణ చెయ్యండి. అనంతరం ప్రతినిత్యం ఉదయం ఋణవిమోచన

అంగారకస్తోత్రం మూడుసార్లు పారాయణ చెయ్యండి. తరువాత మీ యింటి దగ్గర ఖాళీస్థలంలో నేను నిర్దేశించిన శుభ ముహూర్తాన శంఖుస్థాపన చెయ్యండి. తరువాత గృహనిర్మాణం ప్రారంభించి - నేను నిర్ణయించిన ముహూర్తంలో గృహప్రవేశం చెయ్యండి - మూడు అంతస్థుల భవనం నిర్మించండి! సందేహించకండి - సాధ్యమా అని తర్కించకండి. మీ జాతకం అపూర్వ వస్తులాభం సూచిస్తోంది. దానిని నిర్లక్ష్యం చేస్తే - ఆ ధనం - రోగ నివారణకు - వ్యాధి రూపంగా - వ్యయం అవుతుంది."

ఆవిడ ఇంకొకసారి నమస్కారం చేసి - మాట్లాడకుండా వెళ్ళిపోయింది!!

ఆనాటికి యీనాడు ఆవిడ కబురు వచ్చింది.

తాను నిర్ణయించిన ముహూర్తానికే - ఆర్భాటంగా శంఖుస్థాపన చేశారని, అలాగే వైభవంగా గృహప్రవేశం కూడా జరిగిందని, తను కర్ణాకర్ణిగా విన్నాడు.

తనకు పిలుపు లేదు, పేరంటము లేదు!!

ఆ సంబరం ముగిసిన చాలా రోజులకి యీనాడు యీ ఆహ్వానం... వెళ్ళకపోతే కబురు చేసినా రాలేదన్న మాట మిగిలిపోతుంది.

తను అన్యమనస్కంగానే వెళ్ళాడు.

ఎదురుగా వచ్చి ఎవ్వరూ స్వాగతం పలుక లేదు. రెండు ఘడియలు నిరీక్షణ అనంతరం ఆవిడ వచ్చింది. రావడమే ప్రశ్నలతో ప్రళయంగా వచ్చింది.

"కబురు చేసిన యింత సేపటికా రావడం. శంఖుస్థాపన, గృహప్రవేశానికి రాలేదేం? బొట్టు కాటుక పెట్టి పిలవాలా? దగ్గర వుండి చేయించవలసిన బాధ్యత మీకు లేదా?"

ఆయన ముఖంలో చిరునవ్వు చెరగలేదు. చూపు ఆవిడని దాటి గోడ మీద ఉన్న తంజావూరు చిత్రపటం మీద నిలిచింది. మర్రి ఆకు మీద పవళించిన బాలకృష్ణుడు.

ఆవిడ కూడా అటు చూసింది. ఆ చూపులో దర్జా వుంది. గర్వముంది. ఏదో చెప్పబోయింది!

"నేను యిల్లు చూడవచ్చునా?" అని ఆయన అడిగాడు.

ఆవిడ ఒక్క క్షణం తటపటాయించింది. చివరకు నౌకరును పిలిచి, "దగ్గరవుండి సిద్ధాంతి గారికి యిల్లు చూపించు" అని ఆజ్ఞాపించింది.

ఆయన చూసి వచ్చాడు.

"ఎల్లా వుంది - అద్భుతంగా వుంది కదూ?" అని అడిగింది.

"తూర్పు ఈశాన్యాలు రవ్వంత పల్లం చేయించండి. కుబేర స్థానానికి బలం చేకూరుతుంది" అని ఆయన అన్నాడు.

ఆవిడ ముఖంలో చికాకు కనిపించింది. "ఇప్పుడు మార్పులు చేర్పులు చెయ్యడానికి కుదరదు" అని అన్నది.

ఆయన లేచి నిలబడ్డాడు.

బహుశః అప్పుడు ఆవిడకు అసలు విషయం గుర్తుకు వచ్చింది కాబోలు- "మీకు తాంబూలం యివ్వాలి కదా - ఊరికే ఎవ్వరి చేత పని చేయించుకోవడం నాకు యిష్టం వుండదు. మీకేం కావాలో అడగండి. ఇస్తాను."

సిద్ధాంతిగారు మనస్సుకు క్షణకాలం మాయ కమ్మింది! పరమాత్మ మీద నుండి మనస్సు పదార్థం మీదకు మరలింది. చూపు మళ్ళీ ఆ వటపత్రశాయి చిత్రం మీద నిలిచింది.

ఆవిడ కూడా అటువంక చూసింది - హేళనగా ఎగతాళిగా నవ్వింది!!

"సిద్ధాంతిగారు, మీకు యింత అత్యాశ కూడదు! ఆ పెయింటింగ్ ఖరీదు ఎంతో తెలుసా? పదిహేను వేలు... మీ అంతస్థుకు, తాహతుకు తగినది అడగండి యిస్తాను."

'అడగండి యిస్తాను!!' మనస్సులో యీ మాటే పదే పదే మసలింది!!

మాయ తొలగింది. వెలుగు వచ్చింది. వివేకం గుర్తుచేసింది!!

'నువ్వు యాచకుడివి కాదు!! దైవజ్ఞుడివి - ఎటువంటి ప్రలోభం, ప్రతిఫలాపేక్ష లేకుండా సమదృష్టితో సమభావనతో ఫలితాలు చెప్పవలసినవాడివి.

ఆశలకు అతీతంగా దూరంగా ఉండవలసిన వాడివి - నీవు స్వీకరించ వలసినది సంభావన. దానం కాదు.'

'ఎందుకు యీ పొరపాటు జరిగింది?' అని మనస్సు ప్రశ్నించింది!! 'నీ సాధన యింకా పూర్తికాలేదు. అందుకనే ఇటువంటి అగ్ని పరీక్షలు. దిగులు పడకు. ప్రమాదో ధీమతా మపి అని అన్నారు - ఎంతటి వారికైనా యిటువంటి సమస్యలు తప్పవు' అంటూ హృదయం ఊరడించింది... చిన్నబోయిన మనస్సు చిరునవ్వు నవ్వింది - మనస్సు మల్లెకన్నా తేలిక అయింది.

ఆవిడ చిరాకుగా ఆయన వంక చూసింది.

"మీరు యింకా ఆ పెయింటింగ్ గురించే ఆశపడుతున్నారా - ఆ బొమ్మను గురించి మరిచిపొండి! అసలు విషయాన్ని గురించి ఆలోచించండి."

అలవాటుగా ఆశీర్వదించడానికి అలవాటు పడ్డ చేతులు, అప్రయత్నంగా ఆవిడకు నమస్కరించాయి. క్షణం కాలు నిలువ లేదు. ఏనుగెక్కినంత సంబరంతో యింటికి తిరిగి వచ్చాడు - ఉత్త చేతులతో.

కనుసన్నలతోనే యిల్లాలు ప్రశ్నించింది - 'క్షేమమా? లాభమా?'

"అది నువ్వే నిర్ణయించాలి - నా దృష్టిలో పెద్ద ప్రమాదం తప్పింది. గొప్ప గండం గడిచింది" అని ఆయన అనగానే - ఆ యిల్లాలి వదనంలో ఆందోళన కనిపించింది.

"ఏమి జరిగింది?" అని అడిగింది.

"తనది కాని దాని మీద మమకారం కలిగింది! ప్రతిబింబం - పదార్ధమనే భ్రమ కలిగింది. అసలు విషయాన్ని గురించి ఆలోచించడం మానేశాను. నేను ఆలోచించ వలసింది పరమాత్మని గురించి - అది క్షణకాలం మరిచాను.

ఇల్లాలు, "నాకు అర్థమయ్యేలాగా చెప్పండి" అని అంది.

ఆయన జరిగిన విషయమంతా చెప్పాడు - ఆయన మాటలు విని ఆవిడ హాయిగా నవ్వింది.

"మీరు నిత్యం కొలిచే పర్వతరాజ నందిని, శారదాంబ రూపంలో మీకు జ్ఞానోపదేశం చేసింది. మీ అంతరాళాల్లోని అజ్ఞానాన్ని ఒక్క మాటతో తొలగించింది. మీరు ఆశించిన దానికంటే ఎక్కువగానే సంభావించింది. ఆవిడకు మనమంతా చాలా ఋణపడి ఉన్నాం" అని అన్నది.

సిద్ధాంతిగారు పంచాంగం పరిశీలనగా చూశారు - ఎంతో సంతోషం వేసింది.

"సామిదేవి - నైధనతార వెళ్ళిపోయి మిత్రతార వచ్చింది" అని అన్నారు.

ఆయన మాట విని ఇల్లాలు నవ్వింది. ఇల్లంతా వెలుగుతో నిండింది.